సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 21 । ఆగస్టు । 2024



శతకాల వీరుడికి..

క్రికెటర్ నంబళ్ల సుశాంత్‌కు మంచి అవకాశం వచ్చింది. అంతర్రాష్ట్ర టోర్నీకి ఎంపికయ్యాడు. - 8లో



ఎస్‌ఐలకు స్థానచలనం

జిల్లాలో పలువురు ఎస్‌ఐలకు బదిలీ జరిగింది. కొందరిని వీఆర్‌కు పంపించారు. - 8లో

ఐసెట్ అలాట్‌మెంట్ల ప్రకటన

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యా మండలి మంగళవారం రాత్రి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్–2024 అలాట్‌మెంట్లు ప్రకటించింది. ఈ నెల 7వ తేదీన ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పూర్తి కాగా, 14వ తేదీన ప్రకటించాల్సిన అలాట్‌మెంట్లు వాయిదా పడ్డాయి. బీఆర్‌ఏయూలో ఎంబీఏలో రెగ్యులర్ సీట్లు 42, సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లు 8, ఎంసీఏలో రెగ్యులర్ సీట్లు 32, సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లు 9 ప్రవేశాలు జరిగాయి. ప్రైవేట్ కళాశాలలకు సంబంధించి టెక్కలి ఐతం కళాశాలలో 32, చిలకపాలెం శివానీలో 37, ఎచ్చెర్ల వెంకటేశ్వరలో 50 ప్రవేశాలు జరిగాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఆర్‌జీయూకేటీ క్లాస్‌వర్క్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది క్లాస్‌వర్క్ బుధవారం ప్రారంభం కానుంది. సోమ, మంగళవారాల్లో సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం ఇవ్వగా 632 మంది హాజరయ్యారు. శుభదినం కోసం కొందరు విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. మరో రెండు రోజుల పాటు విద్యార్థులు రిపోర్టుకు అవకాశం కల్పించారు. 1065 మందికి ప్రస్తుతం ప్రవేశాలు కల్పించారు. ప్రత్యేక కేటగిరిలో దివ్యాంగుల కోటా నిలిపివేశారు. మిగతా ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, స్కౌట్ వంటి ఇతర ప్రత్యేక కేటగిరీల్లో ప్రవేశాలు కల్పించారు. దివ్యాంగుల కోటాలో కొన్ని ఫేక్ సర్టిఫికెట్లు అధికారులు గుర్తించటంతో ఈ కోటాలో ప్రవేశాలు నిలిపి వేశారు. దివ్యాంగ సర్టిఫికెట్ల నిజ నిర్ధారణ, సదరం ధ్రువీకరణ, ఫేక్ ధ్రువీకరణ పత్రాల దర్యాప్తు వంటివి పూర్తయ్యాక ఈ కోటాలో ప్రవేశాలు కల్పిస్తారు. బాలికలకు ఎస్‌ఎంపురం కాంపస్‌లో, బాలురకు చిలకపాలెం శివానీ అద్దెక్యాంపస్‌లో క్లాస్‌లు ప్రారంభిస్తారు. షెడ్యూల్ మేరకు క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ చెప్పారు.

దోమల వల్లే ప్రాణాంతక వ్యాధులు



మలేరియా నియంత్రణపై ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: సీజనల్ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులకు మన చుట్టూ ఉన్న దోమలే కారణమని, అందుకే మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు కృషి చేద్దామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ర్యాలీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో పాటు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, దోమల నివారణ చేపట్టి, దోమల రహిత జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఈ దోమల కారణంగా ఇప్పటివరకు జిల్లాలో 30 మలేరియా కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. అనంతరం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీని నిర్వహించారు.

ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల నిరసన



విద్యార్థుల నిరసన

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో మంగళవారం నిరసనకు దిగారు. గత 15 రోజుల నుంచి విద్యుత్ సప్లై లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నట్లు పిల్లలు, ఉపాధ్యాయులు తెలిపారు. మోటారు పనిచేయటం వల్ల రన్నింగ్ నీటి సౌకర్యం లేదని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వహణ సాధ్యం కావటం లేదని, మరుగుదొడ్ల నిర్వహణ నిలిచి పోయిందని, విద్యార్థులకు తాగునీరు అందటం లేదని వీరు చెబుతున్నారు. మధ్యాహ్నం భోజనం సైతం మంగళవారం వండ లేదు. దీంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేశారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా చెబుతున్నారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ హరికృష్ణ వద్ద ఈ అంశం ప్రస్తావించగా, విద్యుత్ సప్లై మెరుగ్గా ఉందని, వైరింగ్ సమస్య ఉందని చెప్పారు. సిబ్బందిని సైతం పంపించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టినట్లు ఎంఈఓ పున్నయ్య వివరించారు.

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కూన ప్రసాద్‌పై టీడీపీ వర్గానికి చెందిన వారు ఆదివారం రాత్రి దాడి చేసిన విషయం విదితమే. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా నలుగురికి ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు. మరో పక్క దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రసాద్ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయట పడ్డాడు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. పికెట్‌ను ఎస్‌ఐ చిరంజీవి పర్యవేక్షిస్తున్నారు. రాత్రి 9 గంటలు దాటాక గ్రామంలోకి వస్తున్న వారి వివరాలు, గుర్తింపు కార్డులు పరిశీలించి అనుమతిస్తున్నారు. నేర నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామంలోని వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్న మేసేజ్‌లు, రెచ్చగొట్టే అంశాలు వంటి వాటిపై సైతం దృష్టి పెట్టారు.

లైట్ తీసుకుంటున్నారా..?

సాక్షి ఫోకస్

మృత్యు దేవత దారి కాస్తోంది. చీకటిగా ఉన్న చోట దాక్కుని వాహనదారులను దెబ్బ కొడుతోంది. జిల్లాలో ఇటీవల చాలా ప్రాంతాల్లో ఆగి ఉన్న వాహనాలను బైక్‌లు ఢీకొట్టాయి. వేగంగా వెళ్తున్న బళ్లు రాత్రిపూట డివైడర్లను తాకి బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదాలన్నింటికీ ఒకే ఒక కారణం.. చీకటి. విద్యుత్ బల్బుల నిర్వహణ సరిగా లేకపోవడం, పలు చోట్ల దీపాలే లేకపోవడంతో ఆయా ప్రాంతాలు రక్త తర్పణం కోరుతున్నాయి. పైడి భీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు చాలా చోట్ల విద్యుత్ దీపాలు సరిగా పని చేయడం లేదు. ఫలితంగా రాత్రిపూట ఆ చీకటిలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రణస్థలం : యూబీ ఎదురుగా సర్వీస్ రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు



వెలుగు అంతంతమాత్రమే



కోమర్తి వద్ద వెలగని లైట్లు

- నరసన్నపేట పరిధిలోని పలు ఫ్లై ఓవర్ల వద్ద విద్యుత్ బల్బులు సరిగా వెలగడం లేదు.
- కోమర్తి, సత్యవరం, దేవాది, తామరాపల్లిల వద్ద పలు లైట్లు వెలగక పోవడంతో చీకటిగా ఉంటోంది.
- అలాగే సత్యవరం, జమ్ము, కోమర్తిల వద్ద సర్వీస్ రోడ్లపై కూడా లైట్లు అంతంత మాత్రంగా వెలుగుతున్నాయి. – నరసన్నపేట

చీకటి మయం

- ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారిపై కొత్తగా నిర్మించిన వంతెనలపై అరకొరగానే లైటింగ్ ఏర్పాటు చేశారు.
- పాలవలస, కంచిలి, సిలగాం జంక్షన్, కొజ్జిరియా జంక్షన్, ఇచ్ఛాపురం వద్ద నిర్మించిన కొత్త బ్రిడ్జిలపైన లైటింగ్ ఏర్పాటు చేసినప్పటికీ, వాటి నిర్వహణ మాత్రం దారుణంగా ఉంది.
- కొర్లాం, కంచిలి రైల్వేఫీడర్ పైన నిర్మించిన బ్రిడ్జి, జాడుపూడి ఆర్.ఎస్ లొద్దపుట్టి గ్రామాల వద్ద నిర్మించిన పాత బ్రిడ్జిలపైన ఇప్పటికీ లైటింగ్ ఏర్పాటు చేయలేదు.
- కంచిలిలో బలియాపుట్టుగ గ్రామ కూడలి వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయి.



పద్మతుల గ్రామం వద్ద సర్వీసు రోడ్డులో అరకొరగా ఏర్పాటు చేసిన లైట్లు

ఇక్కడ సర్వీసు రోడ్డులో స్తంభాలు వేసినప్పటికీ లైటింగ్ ఏర్పాటు చేయలేదు.

- బూరగాం, జలంత్రకోట, బలియాపుట్టుగ, ఆదివారం సంత కూడలి, జాడుపూడి కాలనీల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. – కంచిలి

అరకొర వెలుగులు

- పలాస నియోజకవర్గం పరిధిలో ఉన్న మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీ జాతీయ రహదారిని పంచుకుంటాయి.
- దాదాపు 30 కిలోమీటర్ల దారిలో అండర్ పాసెజ్ వంతెనల కింద విద్యుత్ బల్బులు అరకొరగానే పనిచేస్తున్నాయి.
- ఆ వంతెనలకు చేరుకోవడానికి చిమ్మచీకటిలో వెళ్లాల్సి ఉంటుంది.
- బెండిగేటు, వెంకటాపురం, లక్ష్మీపురం, కంబిరిగాం, మొగిలిపాడు, కోసంగిపురం, మకరజోల, మందసారోడ్డు, పాలవలస వంతెనల వద్ద ఈ పరిస్థితి ఉంది. – కాశీబుగ్గ

ప్రమాదాలకు నిలయం


- రణస్థలం మండలంలోని పైడిభీమవరం నుంచి రణస్థలం వరకు నాలుగు ఫ్లై ఓవర్లు ఉన్నాయి.
- అందులో పైడిభీమవరం ఫ్లై ఓవర్‌పై పూర్తిగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు.
- అలాగే పతివాడపాలెం, నెలివాడ, కోష్టలోని ఫ్లై ఓవర్‌లో అక్కడక్కడ మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి.
- యునైటెడ్ బ్రూవరీస్ ఎదురుగా భారీ లారీలు నిలిపే సర్వీస్ రోడ్డులో కూడా విద్యుత్ దీపాలు అసలు వెలగడం లేదు. – రణస్థలం

భయం.. భయం

- ఎచ్చెర్ల మండల పరిధిలోని జాతీయ రహదారిపై రాత్రిపూట ప్రయాణం భయంభయంగా మారుతోంది.
- ఎచ్చెర్ల మండలంలో అరిణాంఅక్కివలస నుంచి తమ్మినాయుడుపేట వరకు జాతీయ రహదారి విస్తరించి ఉంది. అరిణాం అక్కివలస, అల్లినగరం, చిలకపాలెం, కింతలిమిల్లు, నవభారత్, సింహద్వారం, ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు ఉన్నాయి.



- ఇక్కడ ఫ్లై ఓవర్‌లకు రెండు వైపులా ఉన్న విద్యుత్ ఎల్‌ఈడీ దీపాలు సక్రమంగా వెలగడం లేదు.
- ద్విచక్ర వాహన చోదకులు ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీ కొట్టటం వల్ల కొన్ని సార్లు ప్రాణాలు పోతున్నాయి.
- మరోపక్క రాత్రిళ్లు నిద్ర మత్తులో ఉన్న డ్రైవర్లు కూడా వెలుతురులేని కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్



సామాన్యులపై ప్రతాపం

- అడిగిన వెంటనే టిఫిన్ ఇవ్వలేదని నరసన్నపేటలో టిఫిన్ దుకాణంపై దాడి
- స్థానిక టీడీపీ ఎమ్మెల్యే రమణమూర్తి ప్రైవేటు పీఏ అనుచరుల రభస



టిఫిన్ బండిని ఎత్తుతున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికారంలో చేతికి వచ్చాక టీడీపీ నాయకుల అరాచకాలకు అంతులేకుండా పోతోంది. తాజాగా నరసన్నపేటలో అడిగిన వెంటనే టిఫిన్ కట్టలేదన్న కోపంతో ఓ చిన్న దుకాణంపై ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ అనుచరులు ప్రతాపం చూపించారు. నరసన్నపేటలో ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు టిఫిన్ బండి మహిళా వ్యాపారిణి కోరాడ శ్రీదేవిపై సోమవారం రాత్రి వారు దురుసుగా ప్రవర్తించారు. వివరాల్లోకి వెళితే..

కోరాడ శ్రీదేవిది బీద కుటుంబం. ఈమె భర్త కేన్సర్ రోగి. కుటుంబ పోషణ కోసం ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు ప్రతి రోజూ సాయంత్రం నుంచి రాత్రి వరకూ టైర్ బండిపై టిఫిన్ విక్రయాలు చేస్తుంటారు. ఎప్పటిలా సోమవారం సాయంత్రం కూడా టిఫిన్ విక్రయాలు చేపట్టారు. సమయం 8.45 గంటలు అవుతుండగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రైవేటు పీఏ రావాడ గణపతిరావు వచ్చి టిఫిన్ కావాలని అడిగారు. 'రద్దీగా ఉంది ఒక్క ఐదు నిమిషా లు ఆగు బాబు టిఫిన్ ఇస్తాను' అని శ్రీదేవి సమాధానమిచ్చారు. కాసేపటి తర్వాత మళ్లీ గణపతిరావు అడగ్గా.. 'మీ కంటే ముందువచ్చిన వారు ఉన్నారు అన్నా ఇస్తా ఆగు అని' శ్రీదేవి కుమారుడు సమాధానమిచ్చాడు. దీన్ని తట్టుకోలేకపోయిన గణపతిరావు 'నాకే టిఫిన్ కట్టవురా.. నువ్వు ఇచ్చినంత వరకూ నేను వేచి ఉండాలా.. నేను ఎవరో తెలుసా..మీ అంతు చూస్తా.. నేను తలుచుకుంటే నీ బండి ఇక్కడ ఉండదు తెలుసా' అని బెదిరించి వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన కొద్ది క్షణాలకే మరో నలుగురు యువకులు వచ్చి టిఫిన్ బండి వద్ద నానా రభస చేశారు. బండిని ఎత్తేయడంతో చట్నీ ఒలిగిపోయింది. ఇడ్లీలు కింద పడిపోయాయి. ఈ సందర్భంగా టిఫిన్ కోసం వచ్చిన వారితో ఆ యువకులు ఘర్షణకు దిగారు. శ్రీదేవి కుమాడుడిపైనా తిరగబడ్డారు. దీంతో స్థానికంగా జనాలు పెద్ద సంఖ్యలో చేరారు. అందరూ వారిపై ఎదురు తిరగడంతో తోక ముడిచారు. ఈ సంఘటనకు చెందిన వీడియో మంగళవారం ఉదయానికి సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది.

అమాంతం బండి ఎత్తిపడేశారు

'మా ఆయన ఆరోగ్యం బాగోలేదు. పదేళ్లగా టిఫిన్ అమ్ముకొని జీవిస్తున్నాం. అందరూ టిఫిన్ చేస్తున్నప్పుడు గణపతిరావు వచ్చారు. టిఫిన్ అడిగితే కొద్ది నిమిషాలు ఆగమన్నాం.మా అబ్బాయిని అడిగారు. అన్నా కడతాను ఐదు నిమిషాలు ఆగమన్నాడు. కట్టవరా.. నీ అంతుచూస్తా.. అని హెచ్చరించి వెళ్లి పోయారు. అలా ఆయన వెళ్లిన కొద్ది సేపటికి నలుగురుయువకులు వచ్చి బండి ఎత్తి పడేశారు. దుర్భాషలాడారు. నేను ఏమీ అనలేదు' అని శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందించారు. ఈ సంఘటన దురదృష్టకరమని, ఇలాంటివి తాను ప్రోత్సహించనని తెలిపారు. ఆ వీడియోలో గణపతి ఫొటో లేదని, జులుం చేసిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీసులకు చెప్పానన్నారు.


తోట మల్లేష్ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం



రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన్నవెంకటాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తల చేతిలో గాయపడి మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తోట మల్లేష్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేశా రు. ఈ మేరకు మంగళవారం మబుగాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ చేతుల మీదుగా మృతుడు మల్లేష్ భార్య ఆదిలక్ష్మి, కుమారుడు మాధవరావుకు చెక్కును అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మల్లేష్ కుమారుడు మాధవరావు వైఎస్సార్‌సీపీ తరఫున బూత్ ఏజెంట్‌గా ఉన్నాడనే కక్షతో గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ కార్యకర్తలు అమ్మవారి పండగలను ఆసరాగా చేసుకుని మాధవరావు తండ్రి మల్లేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మల్లేష్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. ఎన్నికల మునుపు కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి సామాన్య ప్రజలపై అతి దారుణంగా దాడులు చేసి రాష్ట్రంలో విధ్వంసాలకు పాల్పడుతున్న విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆయనతో పాటు కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, మండల నాయకులు రోణంకి మల్లయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సంపతిరావు హేమసుందర్‌రాజు, అన్నెపు రామారావు, పేడాడ వెంకట్రావు, కె.సంజీరావు, జి.సూర్యప్రకాశరావు, మెండ తాతయ్య, బొడ్డు అప్పన్న, దుక్క రామకృష్ణారెడ్డి, మెట్టు వాసు, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆ తీరమంతా.. సువాసనంట



బిర్యానీ చేస్తున్న కొయిలాపు వెంకటరావు



- వసప బిర్యానీకి జనం ఫిదా
- ఒడిశా, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రాక
- గ్రామంలో 8 బిర్యానీ పాయింట్లు
- రోజుకు వందల్లో బిర్యానీ ప్యాకెట్ల విక్రయం

ఆ వంశధార తీరానికి చేరుతూనే బిర్యానీ సువాసన స్వాగతమంటూ పిలుస్తుంది. ఊరి పొలిమేరలోనే ఆ వాసనకు కడుపులో జఠరాగ్ని రాజుకుంటుంది. ఒక్కో వీధి దాటుకుంటూ వెళ్తుంటే ఆకలి అమాంతం పెరిగిపోతూ ఉంటుంది. ఎర్రగా కారం పట్టిన మాంసం ముక్కను మధ్యలో దాచుకున్న ఓ బిర్యానీ ముద్ద నాలిక కొసన తగలగానే కడుపు, మనసు రెండూ ఆనందాన్ని ప్రకటించేస్తాయి. వసప బిర్యానీ చేసే మాయ ఇది. 200 గడపలుండే ఈ చిన్న ఊరు బిర్యానీకి పెట్టింది పేరు.



బిర్యానీ వంటకు ముందుగా బియ్యం ఎసరు కోసం వేడి చేస్తున్న నీరు

కొత్తూరు:

కొత్తూరు నుంచి నివగాం వెళ్లే పాలకొండ–హడ్డుబంగి రోడ్డుకు ఆనుకుని ఉండే చిన్న గ్రామం పేరే వసప. కొత్తూరు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ ఊరు. ఊరు చిన్నదే అయినా నిత్యం ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్, హడ్డుబంగి, కాశీనగర్, పర్లాఖిమిడితో పాటు ఉమ్మడి జిల్లాలోని కొత్తూరు, పాతపట్నం, పలాస, పాలకొండ, సీతంపేట, హిరమండలం, భామినితో పాటు జిల్లా కేంద్రం శ్రీకాకుళం వాసులు కూడా నిత్యం ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడి బిర్యానీ రుచి అలాంటిది మరి. శ్రీకాకుళానికి వీవీపీలు ఎవరు వచ్చినా ఇక్కడి నుంచి పొట్లాలు పట్టుకెళ్లాల్సిందే. నాణ్యమైన బియ్యం, మసాలా దినుసుల వాడకమే ఇక్కడి రుచికి కారణమని తయారీ దారులు చెబుతుంటారు. వసప గ్రామంలో మొదటి సారిగా బిర్యానీ పెట్టిన కొయిలాపు వెంకటరావు దగ్గర రుచి భలేగా ఉంటుందని తిన్నవారు చెబుతుంటారు. ఆ రోడ్డుపక్కగా వెళ్తూ బిర్యానీ కొనని వారంటూ ఎవరూ ఉండరంటే అతిశయోక్తి కాదు. ఉదయం 10 గంటలు నుంచి రాత్రి వరకు అక్కడ బిర్యానీ ఘుమఘుమలాడుతూనే ఉంటుంది. కార్తీకం వచ్చిందంటే చాలు ఇక్కడ ఖాళీ ఉండదు. శుభకార్యాల భోజనాలు, యువకులు పార్టీల కోసం వసపనే ఆశ్రయిస్తారు. అక్కడ మొత్తం 8 బిర్యానీ పాయింట్లు ఉన్నాయిప్పుడు.



వెంకటరావు తయారు చేసిన దమ్ బిర్యానీ

రుచి అమోఘం



వసప బిర్యానీ చాలా బాగుంటుంది. ఒడిశా నుంచి వచ్చి కొంటూ ఉంటాను. వెంకటరావు దగ్గర బిర్యానీ మరింత రుచికరంగా ఉంటుంది.

– పి.రవి, హడ్డుబంగి, ఒడిశా

హైదరాబాద్‌లో నేర్చుకున్నా..



దమ్ బిర్యానీ కోసం ముందుగా వేడి చేసిన నీటిలో బియ్యం ఎసరు పెడతాను. మసాలా దినుసులు మంచి కంపెనీలవి తీసుకుంటాను. నాణ్యమైన బియ్యం కొనుగోలు చేస్తాను. వీటితో నా శైలిలో దమ్ బిర్యానీ తయారు చేస్తాను. నేనూ హైదరాబాద్‌లోనే ఈ విద్య నేర్చుకున్నాను. – కొయిలాపు వెంకటరావు

క్లుప్తంగా

వర్సిటీ హాస్టల్ పరిశీలన



మెస్‌లో భోజనం చేస్తున్న వీసీ రజని, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వసతి గృహం, మెస్ నిర్వహణ మెరుగ్గా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలోని వసతి గృహం, మెస్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మెస్‌లో భోజనం చేశారు. మెస్‌లో తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వసతి గృహం చుట్టూ పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. బయట ఆహార పదార్థాలు వసతి గృహంలోకి అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యలు లేని వసతి గృహం, మెస్ నిర్వహణ లక్ష్యంగా సిబ్బంది ముందుకు సాగాలని వివరించారు. ఈ పరిశీలనలో రిజిస్ట్రార్ పి.సుజాత, వసతి గృహం నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

ఎల్పీ సెట్ నిర్వహించాలని వినతి



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛంతోపాటు వినతిపత్రం అందజేస్తున్న హిందీ ప్రచారసభ బృందం ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఎల్పీ సెట్ (భాషా పండితుల ప్రవేశ పరీక్ష) నిర్వహించి, హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రతినిధి బృందం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి విన్నవించారు. మంగళవారం శ్రీకాకుళంలో కేంద్రమంత్రిని కలిసిన హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ ఎస్.గైబువల్లి, ఏపీ హిందీ ప్రచార సభరాష్ట్ర అధ్యక్షులు సీ.ఎల్.నాయుడు, రాష్ట్ర ప్రచార సంచాలకులు కోనే శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు తదితరులు కలిసి వినతిపత్రం అందించారు.

ఇంకా డోలీ బతుకులే



డోలీపై తీసుకెళుతున్న దృశ్యం

హిరమండలం: గిరిజన ప్రాంతాల్లో ఇంకా డోలీ బతుకులు తప్పడం లేదు. హిరమండలం మండలం పెద్దగూడ పంచాయతీ పాండ్రమనిగూడ గ్రామానికి చెందిన సవర రాజు మంగళవారం అనారోగ్యానికి గురయ్యాడు. 108 వాహనం కూడా రాకపోవడంతో అతి కష్టం మీద కుటుంబసభ్యులు డోలీ కట్టి సుమారు రెండు కిలోమీటర్ల మేర కొండ దిగువ బూతాలగూడ బత్తిలి రహదారికి వచ్చి 108వాహనంలో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు.

శతకాల వీరుడికి... సువర్ణావకాశం



సెంచరీ సాధించిన నంబళ్ల సుశాంత్

- ఆలిండియా అంతర్‌రాష్ట్ర అండర్–19 క్రికెట్ టోర్నీకి సుశాంత్ ఎంపిక
- బీసీసీఐ ఆధ్వర్యంలో గుజరాత్ వేదికగా జరగనున్న మెగా టోర్నీ
- 15 మంది సభ్యులతో కూడిన ఆంధ్రా జట్టుకు నంబళ్ల సుశాంత్ ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్ నంబళ్ల సుశాంత్ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. గత రెండు నెలలగా జరిగిన ఏసీఏ అంతర్‌జోనల్ క్రికెట్ టోర్నీల్లో భీకర ఫామ్‌ను కొనసాగిస్తూ సెంచరీల మోత మోగించిన సుశాంత్ బీసీసీఐ నిర్వహిస్తున్న అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఏసీఏ ఆంధ్రా అండర్–19 పురుషుల జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిన 15 మంది సభ్యులతో కూడిన ఆంధ్రా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓపెనర్‌గానే సుశాంత్‌కు ఛాన్స్ లభించింది.

బీసీసీఐ ఆధ్వర్యంలో మెగా టోర్నీ..

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో రిలయన్స్ సంస్థ సహకారంతో ఈనెల 24 నుంచి ఆలిండియా అంతర్‌రాష్ట్ర అండర్–19 పురుషుల ఇన్విటేషన్ లీగ్ అండ్ నాకౌట్ టెస్ట్(త్రీడేస్ మ్యాచ్‌ల) టోర్నమెంట్ 2024–25 జరగనుంది. యువ టాలెంట్‌ను వెలికితీసేందుకు బీసీసీఐ మెగా టోర్నీని నిర్వహిస్తుంది. ఈ మూడో సీజన్ మెగా టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు బరోడా, బెంగాల్, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, మధ్యప్రదేశ్, ముంబాయ్, పంజాబ్, సౌరాష్ట్ర రాష్ట్రాల జట్ల ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈనెల 24 నుంచి ఈ పోటీలు మొదలుకానున్నాయి. ఈ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా జట్టుకు శ్రీకాకుళం నుంచి ఒకే ఒక్కడు నంబళ్ల సుశాంత్ ఎంపికయ్యాడు.

అత్యద్భుతమైన ఆటతీరుతో రాణింపు..

గత కొన్నేళ్ల నుంచి అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సుశాంత్ అద్భుతంగా రాణిస్తున్నాడు. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్‌ఎం కాలేజ్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఏసీఏ అంతర్‌జోనల్ పురుషుల అండర్–19 త్రీడేస్(టెస్ట్) మ్యాచ్‌ల టోర్నీలో శ్రీకాకుళం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న నంబళ్ల సుశాంత్ టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఇటీవలి ముగిసిన పరిమిత ఓవర్ల వన్డే టోర్నీలో 5 మ్యాచ్‌ల్లో 341 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా త్రీడేస్ టోర్నీలోనూ సెంచరీల మోత మోగిస్తున్నాడు. అటు ఏసీఏ ఆంధ్రా అండర్–19జట్టుతోపాటు ఇటు ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపికయ్యేందుకు బలమైన బాటలు వేసుకుంటున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే ఐదు సెంచరీలతో కదంతొక్కాడు. ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌లోనూ అదరగొడుతున్నాడు.

తండ్రి ప్రోత్సాహంతో..

సుశాంత్ స్వస్థలం జిల్లాలోని టెక్కలి పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ. ప్రస్తుతం శ్రీకాకుళంలోనే నివాసం ఉంటున్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి నంబళ్ల జగదీష్ శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి అర్చన గృహిణి. తండ్రి దగ్గరుండి నిరంతరం ప్రోత్సహిస్తుండటంతో సుశాంత్ అదరగొట్టేలా ప్రతిభను చూపిస్తున్నాడు.

క్రికెట్ సంఘం అభినందన..

ప్రతిష్టాత్మక ఆలిండియా అంతర్‌రాష్ట్ర మెగా క్రికెట్ టోర్నీకి నంబళ్ల సుశాంత్ ఎంపికపై క్రికెట్ సంఘ జిల్లా అధ్యక్షుడు పీఎల్‌ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజ షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ రవికుమార్ తదితరులు అభినందించారు. యువ క్రీడాకారుడి రాణింపుపై తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్ బదిలీపై విద్యార్థుల ఆందోళన



కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు బదిలీపై అక్కడి విద్యార్థులు మంగళవారం ఆందోళన చేశారు. కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావును సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి బదిలీ చేసినట్లు సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. ప్రిన్సిపాల్ వెంటనే రిలీవ్ అవ్వటం, సరుబుజ్జిలి కాలేజీలో చేరిపోవటం జరిగిపోయింది. దీంతో కాలేజీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మంగళవారం తరగతులను బహిష్కరించి నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ బదిలీని నిలుపుదల చేసి వెనక్కి పంపించాలని, లేదంటే టీసీలు తీసుకుని వేరే కాలేజీలకు వెళ్లిపోతామని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యాభివృద్ధితో పాటు కాలేజీ అభివృద్ధిలోనూ ఎంతగానో కృషి చేసిన ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయటం బాధాకరమన్నారు.

బదిలీ వెనుక కారణమిదేనా..?

ఈ కాలేజీలో ఓ గెస్ట్ లెక్చరర్ పనితీరుపై ప్రిన్సిపాల్ అసహనం వ్యక్తం చేసేవారు. ఆ అధ్యాపకుడు తరచూ విధులకు గైర్హాజరవుతుండడంతో తీరు మార్చుకోవాలని సూచించారు. దీంతో ఆ గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకుడు ప్రిన్సిపాల్‌తో వాదనకు దిగి తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి బదిలీ చేయించినట్లు సమాచారం.

దీనిపై డీవైఈఓ ఎస్.తవిటి నాయుడు మాట్లాడుతూ సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బోధన సిబ్బంది తక్కువగా ఉన్నందున ప్రిన్సిపాల్‌ను అక్కడికి బదిలీ చేశామని తెలిపారు. ఆయన మంగళవారం లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు.

దినసరి వేతనదారుల నియామకాలపై విచారణ నేడు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో గత ప్రభుత్వం హయాంలో దినసరి వేతనదారులుగా కొందరు సిబ్బంది నియామకాలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు రాజమహేంద్రవరానికి చెందిన ఆర్జేసి క్యాడర్ అధికారి సుబ్బారావును విచారణాధికారిగా దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఇటీవలే నియమించిన సంగతి విధితమే. అయితే ఈమేరకు విచారణను ప్రత్యక్షంగా నిర్వహించేందుకు బుధవారం సుబ్బారావు అరసవల్లి రానున్నారు. ఇందుకోసం ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఈఓగా పనిచేసిన హరిసూర్యప్రకాష్ హయాంలోనే ఈ నియామకాలు జరిగాయని గుర్తించడంతో ఆయన్ను ప్రత్యేకంగా విచారించనున్నారు. ఈ మేరకు నేటి విచారణకు ఆలయంలో పనిచేసిన దినసరి వేతనదారులు కూడా తమ పరిస్థితులను తెలియజేయాలని భావిస్తున్నట్లుగా సమాచారం.

గత నియామకాలపై దృష్టి

గత ప్రభుత్వ హయాంలో అరసవల్లి ఆలయంలో విధుల నిర్వహణకు గాను అలాగే ఆదివారాలు, పర్వదినాల్లో విధులకు గాను భక్తుల సౌకర్యాల కల్పన దిశగా అప్పట్లో ఈఓ హరిసూర్యప్రకాష్ ఈ మేరకు దాదాపుగా నియామకాలను చేపట్టారు. అయితే ఈ మేరకు దినసరి వేతనాలు ఇచ్చేలా అప్పట్లో కమిషనరేట్ నుంచి బడ్జెట్ మంజూరు కూడా జరిగింది. దీంతో సుమారు 48 మంది వరకు దినసరి వేతనదారులకు రోజువారి లెక్కన సుమారు మూడున్నరేళ్లుగా చెల్లింపులు జరిగాయి. అలాగే సిబ్బంది నియామకాలతోనే దాదాపుగా ఆలయ వార్షికాదాయం రెట్టింపు అయినట్లుగా దేవదాయ శాఖాధికారులే గుర్తించారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే టీడీపీ నేతలకు అరసవల్లిలో పనిచేస్తున్న ఈ దినసరి వేతనదారుల ఉద్యోగాలపై దృష్టి పడింది. ఉన్న ఫళంగా వారందరినీ తొలిగించాలంటూ సాక్షాత్తు జిల్లా మంత్రి అచ్చెన్నాయుడే కలెక్టర్ సమీక్షలో తేల్చి చెప్పేశారు. దీంతో అరసవల్లిలో దినసరి వేతన దారుల అంశం చాలా చర్చనీయాంశమైంది. తాజాగా బుధవారం విచారణ జరగనున్న నేపథ్యంలో ఈ 48 మంది భవితవ్యం తేలనుంది. వీరందరినీ తొలిగించి తమ వారిని నియమించుకునేలా టీడీపీ అగ్ర నేతలు పక్కా ప్రణాళిక అమలు చేయనున్నారని, అందుకే ఈ విచారణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని వీరినందరినీ తొలిగించే దిశగా అడుగులు పడనున్నట్లుగా చర్చ సాగుతోంది. తప్పులు లేదా అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని తొలగించి మిగిలిన వారిని ఔట్‌సోర్సింగ్ విధానంలో కొనసాగించాలని దినసరి వేతనదారులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇప్పటివరకు సుమారు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ జీతాలను కూడా తక్షణమే చెల్లింపులు జరపాలని, ఉద్యోగ భద్రత చూపించకపోతే శాంతియుత పోరాటాలకు దిగుతామంటూ సంకేతాలు పంపుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

- పలు కేసుల్లో నిందితులుగా గుర్తింపు
- 85 గ్రాముల బంగారం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

టెక్కలి రూరల్: టెక్కలిలో గత కొద్ది రోజులుగా రెచ్చిపోతున్న దొంగలను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. భువనేశ్వర్, వెస్ట్‌బెంగాల్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగలను సీసీ పుటేజీల ఆధారంగా గుర్తించి వారిని పట్టుకున్నట్లు టెక్కలి సీఐ పి.షైడయ్య మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి రోటరీ నగర్–1 గత నెల 31వ తేదీన జరిగిన చోరీతో పాటు మరికొన్ని చోరీలకు సంబంధించి కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో సీసీ పుటేజీల ఆధారంగా నలుగురు వ్యక్తులను గుర్తించామని వారిలో భువనేశ్వర్‌కు చెందిన సిభుదాస్, తరేమిరావు, వెస్ట్ బెంగాల్‌కు చెందిన దిలీప్ రాయ్, దీపాంకర్ రాయ్‌లు ఉన్నారని పేర్కొన్నారు. సిభుదాస్, తరేమిరావు అనే ఇద్దరు వ్యక్తులు ఇళ్లల్లో, షాపుల్లో చోరీ చేసిన బంగారాన్ని వెస్ట్ బెంగాల్‌కు చెందిన దిలీప్ రాయ్, దీపాంకర్ రాయ్‌లకు ఇస్తారని, వారు ఆ బంగారాన్ని కరిగించి వేరే వస్తువులుగా మార్చి వాటిని అమ్మి డబ్బులు ఇస్తుంటారని తెలిపారు. ఈ విధంగా ఈ నలుగురు చోరీలకు పాల్పడుతుంటారని సీఐ తెలిపారు.

సోమవారం విశాఖపట్నం వెళ్లేందుకు రైలులో పలాస వచ్చి అక్కడ వారి దగ్గర ఉన్న కొంత బంగారం అమ్మడానికి వెళ్తుండగా సమాచారం అందుకున్న టెక్కలి పోలీసులు వారిని పలాస రైల్వేగేటు వద్ద అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6లక్షల29వేలు విలువ గల 85గ్రాముల బంగారంతో పాటు రూ.7వేల నగదు, ఐదు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ నలుగురు వ్యక్తులు టెక్కలితో పాటు జలుమూరు, ఇచ్ఛాపురం, కాశీబుగ్గ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు గుర్తించి వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ముద్దాయిలను పట్టుకునేందుకు ఎంతగానో కృషిచేసిన సీఐ పి.షైడయ్యతో పాటు జలుమూరు ఎస్ఐ కె.మధుసూదనతో పాటు సిబ్బందిని పలువురు అభినందించారు. పై చోరీలకు సంబంధించి టెక్కలిలో మూడు కేసుల్లో ఒక్క రోటరి నగర్–1లోనే 12 తులాల వరకు బంగారం, రూ.3.5 లక్షల క్యాష్ చోరీ జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. టెక్కలి వంశధార కాలనీలో మరో రెండు చోరీలు, కాశీబుగ్గ, జలుమూరు, ఇచ్ఛాపురంలో సైతం చోరీలకు సంబంధించి నలుగురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 7.5 తులాల బంగారం, రూ.7వేలు నగదు మాత్రమే స్వాధీనం చేసుకోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మిగిలిన బంగారం, డబ్బులు ముద్దాయిలు నుంచి సేకరించి తమకు ఇప్పించాలని కోరుతున్నారు.

బీఆర్‌ఏయూలో నియామకాలపై కమిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమయంలో నియామకాలపై కమిటీ వేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ సుజాత మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, కె.స్వప్న వాహినిలను నియమించారు. 2019 నుంచి 2024 వరకు ఎలాంటి పోస్టులు నియమించారు. వారి అర్హతలు వంటివి అందజేయాలని సూచించారు. ఇందులో కూటమి నాయకుల ఒత్తిడి ఉన్నట్లు వర్సిటీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అయితే ఈ కమిటీ లో వేసిన సభ్యులు ఆర్డర్లు తీసుకోకపోవటం గమనార్హం. కొందరు తమకు ఈ బాధ్యతలు వద్దని రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లు తెలుస్తోంది.

'వారానికోసారి మండలాలకు వెళ్లాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: వారానికోసారి ప్రత్యేక అధికారులు మండలాలకు వెళ్లాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆర్డీఓలు, మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 21 నుంచి ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఎలక్ట్రోరల్స్ పై మండలాల వారీగా ఆయన సమీక్షించారు. పలు శాఖలపై ఆయా శాఖాధిపతులు కలెక్టర్‌కు వివరించారు.

పలాసలో అక్రమంగా గోమాంస విక్రయం



ఇందిరా కాలనీలో అమ్మకానికి ఉంచిన ఆవు మాంసం



దూడను కాపాడిన గోసంరక్షకులు, స్థానికులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఇందిరా నగర్ కాలనీలో ఆవుమాంసం అమ్మకాలను స్థానికులు, గో సంరక్షకులు అడ్డుకున్నారు. ఇక్కడ ప్రతి మంగళవారం గోమాంసం విక్రయిస్తున్నట్లు బయటపడింది. ఇందిరానగర్‌లో అమ్మవారి మందిరం, చర్చిలకు ఆనుకుని ఉన్న కాలనీలో అక్రమంగా స్థలాన్ని ఆక్రమించి అదే ప్రాంతంలో అక్రమంగా ఆవులను చంపి మాంసాన్ని వాటాలుగా వేసి అమ్మకాలు జరుపుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, గోసంరక్షకులు ఘటనా స్థలానికి చేరుకుని మాంసం అమ్మకాలను అడ్డుకున్నారు. ఓ ఆవు దూడను విడిపించి గో సంరక్షణ కేంద్రానికి తరలించారు. అనంతరం 112, 100కు కాల్ చేయగా.. పోలీసులు మాంసం విక్రయదారులను స్టేషన్‌కు తరలించారు. మున్సిపాలిటీ అనుమతులు లేకుండా మాంసం విక్రయిస్తున్నారని తెలిపారు. కాశీబుగ్గ సీఐ విజయానంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్లలోకి బయటి ఆహారం వద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నడుపుతున్న హాస్టళ్లకు బయట నుంచి ఆహారం అనుమతించకూడదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రభుత్వ వసతి గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల రక్షిత గృహాలు, హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యాశాఖ విద్యార్థులకు అక్షయపాత్ర నుంచి ఆహారం వస్తుందని డీఈఓ కృష్ణ చైతన్య వివరించారు. స్టోరేజ్ చేసిన తాగునీరు వినియోగించకూడదని చెప్పారు. ఆర్‌ఓ ప్లాంట్ ఉండాలని, పండ్లు, కూరగాయలు తాజాగా ఉండాలని సూచించారు. బయట నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆహారం తీసుకోకూడదని చెప్పారు. కాలేజీ అటాచ్ హాస్టల్ ఉంటేనే నడపాలని వెనుకబడిన సంక్షేమ అధికారి అనూరాధ కలెక్టర్‌కు వివరించారు. ఏవైనా ఆహార పదార్థాలకు కాల పరిమితి ముగిసిపోతే పారవేయాలని ఆహార భద్రతా అధికారి జి.శ్రీరాములు చెప్పారు. సహాయ భద్రత నియంత్రణాధికారి వెంకటరత్నం 9704009989 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతి శ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో మెనూ బయట డిస్‌ప్లే చేయాలన్నారు. అన్నీ పరిశీలించి సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణ చైతన్య, జిల్లా రెసిడెన్షియల్ స్కూల్స్ కో ఆర్డినేటర్ బాలాజీ నాయక్, ఆర్‌ఐఓ దుర్గారావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ లక్ష్మి, ప్రొటెక్షన్ జిల్లా అధికారి రమణ పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలో 26 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లను స్థానచలనం చేస్తూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో 16 మందికి వివిధ స్టేషన్లలో పోస్టింగ్ దక్కగా పదిమందిని వీఆర్‌కు పంపించడం గమనార్హం.

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీపై వెళ్లేది
ఎస్ చిరంజీవి	ఎచ్చెర్ల	జె.ఆర్.పురం
కె.గోవిందరావు	జె.ఆర్.పురం	వీఆర్(శ్రీకాకుళం)
జి. లక్ష్మణరావు	పాడేరు	లావేరు
సిహెచ్.స్వామినాయుడు	లావేరు	వీఆర్ (విశాఖ)
ఎం.ప్రవల్లిక	ఉమెన్‌పీఎస్(శ్రీకాకుళం)	బూర్జ
జి. ప్రసాద్	బూర	వీఆర్ (విశాఖ)
వి. సత్యనారాయణ	ఇచ్ఛాపురం టౌన్	పొందూరు
సీహెచ్.దుర్గాప్రసాదరావు	డీఎస్‌బీ (ఏఎస్‌ఆర్‌జిల్లా)	నరసన్నపేట
బి.అశోక్‌బాబు	నరసన్నపేట	జలుమూరు
కె.మధుసూదనరావు	జలుమూరు	వీఆర్(శ్రీకాకుళం)
గార్లపు రంజిత్	డీఎస్‌బీ (ఏఎస్‌ఆర్ జిల్లా)	పోలాకి
వి. సత్యనారాయణ	పోలాకి	వీఆర్(శ్రీకాకుళం)
మి. అనిల్‌కుమార్	మందస	సారవకోట
జి. అప్పారావు	సారవకోట	వీఆర్(విశాఖ)
ఆర్. సంతోష్	అరకు (ఏఎస్‌ఆర్ జిల్లా)	టూటౌన్(శ్రీకాకుళం)
ఎం. హరికృష్ణ	టూటౌన్ (శ్రీకాకుళం)	వీఆర్(శ్రీకాకుళం)
బి. లావణ్య	ఉమెన్‌పీఎస్(మన్యం జిల్లా)	పాతపట్నం
ఎండీ యాసీన్	పాతపట్నం	హిరమండలం
జి. నారాయణస్వామి	హిరమండలం	వీఆర్(శ్రీకాకుళం)
బి. రేవతి	ఉమెన్ పీఎస్ (శ్రీకాకుళం)	కాశీబుగ్గ యూపీఎస్
పి. పారినాయుడు	కాశీబుగ్గ యూపీఎస్	వీఆర్(శ్రీకాకుళం)
ఎస్‌కె ఖాదర్‌భాషా	డీఎస్టీ అటాచ్డ్‌టీసీ(శ్రీకాకుళం)	మందస
ఈర్లె చిన్నంనాయుడు	చినమేరంగి (మన్యం జిల్లా)	ఇచ్ఛాపురంటౌన్
ఇమంది శ్రీనివాస్	ఆర్.ఎ.వలస (విజయనగరం)	ఇచ్ఛాపురం రూరల్
ఎన్. లక్ష్మణ	ఇచ్ఛాపురం రూరల్	వీఆర్(విశాఖ)
కె. లక్ష్మి	వీఆర్ (శ్రీకాకుళం)	ఉమెన్‌పీఎస్(శ్రీకాకుళం)

చెరువులో పడి యువకుడు గల్లంతు



దుర్గారావు (ఫైల్)

పోలాకి: మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన అమలాపురం దుర్గారావు(24) అనే యువకుడు చెరువులో పడి గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. సాయంత్రం స్థానిక కర్ణాల చెరువులో స్నానానికి వెళ్లిన సమయంలో చెరువులో గొయ్యి వద్ద దిగి తిరిగి రాలేకపోయాడు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేష్‌కుమార్ గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవటంతో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో గాలింపు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.